సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



సీజనల్ వ్యాధులపై కళాజాత

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు కళాజాత కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో చైతన్య తెలిపారు. 8లో



మొరాయించిన ఆర్టీసీ బస్సు

పాడేరు-గూడెం మార్గంలో జి.మాడుగుల వద్ద పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. 8లో



మోగనున్న పెళ్లి బాజాలు 8లో

శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పెళ్లి సందడి మొదలైంది. జూలై, ఆగస్టు, నవంబర్, డిసెంబర్ నెలల్లో శుభముహూర్తాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

అధికార పార్టీకి కోడ్ వర్తించదా?

- కూటమి ఫ్లెక్సీల జోలికి వెళ్లని అధికారులు



పాడేరులో ఇంకా తొలగించని టీడీపీ ఫ్లెక్సీ

పాడేరు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారు. జిల్లా కేంద్రం పాడేరులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు, టీడీపీ ఫ్లెక్సీల జోలికి వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఫ్లెక్సీలు చాలా చోట్ల దర్శనమిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు తీరు ఇలాగేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. పక్షపాతధోరణి అవలంబిస్తున్న అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు.

పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై జీఎస్ఐ సర్వే

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో సీలేరు సమీపంలో పార్వతీనగర్ వద్ద నూతనంగా నిర్మించబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై మరోసర్వే నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) బృందం సోమవారం సర్వే జరిపింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిర్ణయించిన తొమ్మిది ప్రాంతాల్లో వీరు పర్యటించారు. ప్రతిపాదించిన అంశాలను పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి వారికి వివరించారు. జల విద్యుత్ కేంద్రం నిర్వహించే ప్రదేశం, టన్నెల్ నిర్మించే ప్రాంతం, గుంటవాడ జలాశయం తదితర ప్రాంతాలను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాప్ కోచ్ సంస్థ ఇచ్చిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీలేరుకు ఒడిశా శివ భక్తులు



సీలేరు శివాలయంలో ఒడిశా భక్తులు

సీలేరు: ఒడిశా రాష్ట్రం గుప్తేశ్వరంలో కొలువై ఉన్న మహేశ్వరుని భక్తులు శివమాలలు ధరించి, కాలినడకన గంగా జలం కావిళ్లతో సోమవారం సీలేరు చేరుకున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసం ప్రారంభంలో ఒడిశాలో ఉన్న నదుల్లోని నీళ్లను కావిళ్లతో తీసుకొచ్చి సీలేరు శివాలయంలో అభిషేకం చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో చిత్రకొండ 11, 12 నంబరు గ్రామాలకు చెందిన 60 మంది భక్తులు కాలినడకన సీలేరు వచ్చి ప్రత్యేక పూజలు జరిపించారు.

పశుగణన ప్రారంభం

చింతూరు: అఖిలభారత పశుగణన-2024ను స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో కావూరి చైతన్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలకు ఆర్థికస్థిరత్వం, పోషకభద్రత అందించడంలో పశువుల పెంపకం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ రంగాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కోళ్ల పరిశ్రమలో నాణ్యతను మెరుగు పరచడానికి, వ్యాధులను నియంత్రించడానికి తద్వారా రైతులను ప్రోత్సహించడానికి వివిధ పథకాలను ప్రారంభించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.

టేకు, గన్నర కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలప దుంగలు

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబులో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 14 టేకు,11 గన్నర, రెండు దద్దుగ దుంగలను పెదవలస రేంజర్ శివరజని ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.36,168 ఉంటుందని అంచనా వేశారు. ఈ దాడిలో అటవీ సెక్షన్ అధికారి నూకరాజు,ఎఫ్‌బీవో భూషణం,స్ట్రైకింగ్ ఫోర్స్‌కు చెందిన చిన్న, సత్తిబాబు, జీవన్‌కుమార్, భాగ్యరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అక్రమంగా కలప తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విషజ్వరాల విజృంభణ

- పెరుగుతున్న మలేరియా కేసులు
- వర్షాలు, వరదలతో వ్యాపిస్తున్న వ్యాధులు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



చింతూరు ఏరియా ఆస్పత్రిలో రోగులతో కిటకిటలాడుతున్న ఔట్‌పేషెంటు వార్డు

చింతూరు: వర్షాలు, వరదల ప్రభావంతో చింతూరు ఏజెన్సీలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చింతూరు ఏరియా ఆస్పత్రితో పాటు డివిజన్‌లోని ఇతర పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలు, ఇతర వ్యాధులతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ఏరియా ఆస్పత్రికి ప్రతిరోజూ 150 నుంచి 200 మంది రోగులు వస్తుండగా వారిలో జ్వరపీడితులు అధికంగా ఉంటున్నారని వైద్యులు తెలిపారు. దీంతోపాటు డివిజన్లోని 10 పీహెచ్‌సీల్లో సైతం ఇదే క్రమంలో రోగులు వస్తుండగా, ఆర్ఎంపీలకు చెందిన ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం నిత్యం 40 నుంచి 50 మంది చికిత్స పొందుతున్నారు.

వరదల అనంతరం

20 రోజుల పాటు చింతూరు డివిజన్‌లో అధికంగా వర్షాలు కురవడంతో పాటు వరదలు సంభవించడంతో వ్యాధులు తీవ్రంగా వ్యాపిస్తున్నాయి. వరదల కారణంగా 15 రోజులపాటు మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో రోగాల బారిన పడిన ప్రజలు ఆస్పత్రులకు వెళ్లేందుకు దారులు లేకుండా పోయాయి. దీంతో వారు ఇళ్లవద్దనే తోచిన వైద్యం చేసుకుంటూ కాలం వెళ్లదీశారు. ప్రస్తుతం వరద పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

పెరుగుతున్న మలేరియా కేసులు

చింతూరు డివిజన్‌లో మలేరియా కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జులై చివరినాటికి చింతూరు డివిజన్లలోని 10 పీహెచ్‌సీల పరిధిలో 196 మలేరియా కేసులు నమోదుకాగా ఈ ఏడాది జూలై నెలలో 76 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జులై వరకు అధికంగా తులసిపాక పీహెచ్‌సీ పరిధిలో 48, మోతుగూడెం పీహెచ్‌సీ పరిధిలో 42, ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీ పరిధిలో 28, రేఖపల్లి పీహెచ్‌సీ పరిధిలో 21, కూటూరు పీహెచ్‌సీ పరిధిలో 20 కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రులకు నిత్యం 150 నుంచి 200 మంది రోగులు వస్తుండగా వారిలో 100 నుంచి 120 మందికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటిలో మలేరియా పాజిటివ్ కేసులతో పాటు టైఫాయిడ్ కేసులు కూడా నమోదవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం నిత్యం 30 నుంచి 40 మంది రోగులకు పరీక్షలు నిర్వహిస్తుండగా 20 మందివరకు జ్వరపీడితులు ఉంటున్నట్లు ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు.



మలేరియాతో బాధపడుతున్నా..

వారం రోజులుగా మలేరియా జ్వరంతో బాధపడుతున్నాను. ముందుగా ఏడుగురాళ్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అనంతరం ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్నా జ్వరం తగ్గలేదు. దీంతో మూడు రోజులుగా చింతూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. వైద్యులు పరీక్షించి మలేరియా పాజిటివ్ అనిచెప్పి వైద్యం అందిస్తున్నారు.

– మడకం వెంకటేష్, బొడ్డుగూడెం, చింతూరు మండలం



టైఫాయిడ్‌కి చికిత్స తీసుకుంటున్నా

కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉన్నా వరదల కారణంగా ఆస్పత్రికి రాలేకపోయాను. ఆదివారం చింతూరు ఏరియా ఆస్పత్రికి వచ్చి రక్తపరీక్ష చేయించగా టైఫాయిడ్ జ్వరమని వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

– పొడియం జానీ, సూరన్నగొంది, చింతూరు మండలం

జాగ్రత్తలు పాటించాలి

వర్షాలు, వరదల కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు పాటించాలి. వేడిచేసిన నీటిని తాగడంతో పాటు వేడి పదార్థాలు, పౌష్టికాహారం తినాలి. ప్రతిఇంటిలో దోమతెరలు వినియోగించడంతో పాటు ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలువ లేకుండా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ కోటిరెడ్డి, సూపరింటెండెంట్, చింతూరు ఏరియా ఆస్పత్రి



చింతూరు ఏరియా ఆస్పత్రిలోని రక్తపరీక్ష కేంద్రం వద్ద వేచివున్న రోగులు

జులై 20 నుంచి ఆగస్టు 3 వరకు నమోదైన కేసుల వివరాలు

పీహెచ్‌సీ	రోగుల సంఖ్య	సాధారణ జ్వరాలు	మలేరియా కేసులు	టైఫాయిడ్ కేసులు
మోతుగూడెం	532	162	6	64
తులసిపాక	401	112	4	39
ఏడుగురాళ్లపల్లి	835	519	0	0
లక్ష్మీపురం	573	70	1	3
నెల్లిపాక	756	57	4	22
గౌరిదేవిపేట	444	25	1	6
కూటూరు	851	392	9	3
కూనవరం	135	0	2	0
రేఖపల్లి	1,089	102	5	172
జీడిగుప్ప	254	47	3	10
కూనవరం (సీహెచ్‌సీ)	388	267	0	67
చింతూరు (సీహెచ్‌సీ)	1,945	337	4	67

కూటమి 'క్యాంపు' కుట్ర.!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నేతల కుయుక్తులు
- పల్లా ఇంట్లో ఎమ్మెల్యేల భేటీ
- అనుకూలంగా ఉన్న వారిని తరలించేందుకు ఎత్తుగడ
- లొంగని వారికి డబ్బులు ఎర

సాక్షి, విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీకి అలవాటైన కుట్ర రాజకీయమే.. ఎన్నికలు ఏవైనా సరే డబ్బులతో ఎదుటివారిని కొనెయ్యడమే వారి నైజమని మరోసారి నిరూపితమవుతోంది. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు సంఖ్యా బలం లేకపోయినా పోటీలో అభ్యర్థిని నిలబెడుతూ క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. తమకు అనుకూలంగా ఉన్నవారిని అమరావతికి తరలించి.. అక్కడే ఎన్నికలయ్యేంత వరకూ కాపాడుకునేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. లొంగని వారికి డబ్బు ఎరగా చూపించి వారిని కూడా 'క్యాంపు'లకు పంపించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ వెలువడనుంది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. ఉత్తరాంధ్ర జిల్లాలో అందరివాడిగా కీలక నేతగా పేరున్న బొత్సని ఢీకొట్టాలంటే తమ తరం కాదని నిర్ధారించుకున్న టీడీపీ.. కుట్ర రాజకీయాలకు తెరతీసింది. ఓట్లతో గెలవడం కష్టమనీ నోట్ల కట్టలతోనే విజయం సాధ్యమవుతుందని భావించి ఆ దిశగా కుయుక్తులు పన్నుతోంది.

పల్లా ఇంట్లో 'క్యాంపు' రాజకీయాలు

గాజువాకలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమి నేతల కీలక భేటీ సోమవారం రాత్రి జరిగింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు, వంశీకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, ఎంపీ సీఎం రమేష్‌తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాల ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. కోట్లు కుమ్మరించైనా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడమే ధ్యేయంగా పనిచేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు డబ్బులను ఎరగా వేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే టీడీపీతో టచ్‌లో ఉన్న పలు ప్రాంతాలకు చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుల మనసు మళ్లీ మారకముందే.. వారిని ఎన్నికలయ్యేంత వరకూ తమ పంచనే ఉండేలా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 60 మందిని అమరావతి తరలించి హోటల్స్‌లో 25 రోజుల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తీర్మానించారు. పలువురు ప్రజా ప్రతినిధులకు కోరినంత డబ్బు ఆశ చూపించి.. వారిని తమ వైపు తిప్పుకునే బాధ్యతల్ని కూడా తీసుకోవాలని ఎమ్మెల్యేలకు పల్లా సూచించారు. 2014 నుంచి 19 వరకూ అనకాపల్లి ఎమ్మెల్యేగా ఉంటూ మైనింగ్‌లో లెక్కలేనంత డబ్బులు కూడబెట్టుకున్న పీలా గోవింద సత్యనారాయణను ఎమ్మెల్సీగా నిలబెట్టాలని కూటమి భావిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో దోచుకున్న సొమ్మునంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచి మళ్లీ దోచుకోవచ్చన్నది వీరి కుట్రగా తెలుస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న పీలా అయితేనే బొత్సను నిలువరించగలరని మూడు పార్టీల నేతలూ భావిస్తున్నారు. తమ పరిధిలో ఓటర్లుగా ఉన్న వారిని ఎలాగైనా తమ వైపు తిప్పుకునే బాధ్యతను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తీసుకోవాలని.. ఇందుకు ఎంత ఖర్చయినా భరించాలని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్

30న పోలింగ్, వచ్చే నెల 3న కౌంటింగ్

మహారాణిపేట(విశాఖ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. ఈ ఎన్నిక ప్రక్రియపై సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లాతోపాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీ సభ్యులు ఓటర్లగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, జిల్లా రెవెన్యూ అధికారి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 14వ తేదీన స్క్రూటినీ, 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్‌లను వినియోగించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు, సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు ఉండరాదన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్‌వో టి.సీతారామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్యాలయ మేనేజర్ కృష్ణకాంత్, కాంగ్రెస్ నాయకుడు సోడదాసు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

స్కీమ్ వర్కర్ల తొలగింపు అన్యాయం



రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

- పాడేరు,రంపచోడవరంలో కదం తొక్కిన కార్మికులు
- భారీ ర్యాలీ, ధర్నా

సాక్షి,పాడేరు/రంపచోడవరం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్కీమ్ వర్కర్లను అక్రమంగా తొలగించారని, ఇది అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఐటీయూ నేతలు,కార్మికులు పాడేరు కలెక్టరేట్, రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున సోమవారం ఆందోళన చేశారు. ర్యాలీ, ధర్నా నిర్వహించి, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాడేరులో జరిగిన ఆందోళనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ కార్మికులు బానిసలు కారని,తక్కువ వేతనాలతో స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా,మధ్యాహ్న భోజన పథకం,వెలుగు ఏఏవోలు,ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,365మంది ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని,వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ ఆందోళనలో సీఐటీయూ నేతలు ఎస్.బి.పోతురాజు,పలు స్కీమ్ ఉద్యోగుల సంఘం నేతలు భాను రాజ్‌కుమార్,శంకరరావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు,కృష్ణారావు,సురేష్‌కుమార్,దాశమ్మ, రాములమ్మ,పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో.. : రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం,స్కూల్ శానిటేషన్ యానిమేటర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు,ఇతర కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులపై కూటమి నేతల వేధింపులు పెచ్చుమీరుతున్నాయని, అక్రమంగా తొలగింపులు, రాజకీయ బెదిరింపులకు పాల్పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.శాంతిరాజు, జిల్లా నాయకురాలు కె.రామలక్ష్మి తెలిపారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగాలకు రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారని తెలిపారు. 2,360 మంది ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను, 750 మంది మధ్యాహ్నం భోజన కార్మికులను, 500 మంది వెలుగు యానిమేటర్లను అక్రమంగా తొలగించారని చెప్పారు. రాజకీయ నాయకుల ఒత్తిడి వల్ల అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న విషయం గుర్తు చేశారు. దేవీపట్నం మండలం ములకలగూడెం అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిపై స్థానిక టీడీపీ నాయకులు రాజకీయంగా వేధిస్తూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌కి అందజేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే భారీ ఎత్తున ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లిరెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కె.చెల్లాయమ్మ, నాయకులు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న స్కీమ్‌వర్కర్లు

ఎమ్మెల్సీగా బొత్సను గెలిపించుకుందాం





పాడేరు, అరకులోయలలో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న విజయనగరం జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను,ఎమ్మెల్సీ రవిబాబు,ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,మాజీ ఎంపీ మాధవి , మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

- ఆత్మీయ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు
- విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి చిన్న శ్రీను హాజరు

సాక్షి,పాడేరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తెలిపారు. పాడేరు,అరకులోయ ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు,రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పాడేరులో, మధ్యాహ్నం అరకులోయ స్థానిక ప్రజాప్రతినిధులతో సోమవారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను),ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు,ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి,మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఈ రెండు నియోజకవర్గాల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బొత్స సత్యనారాయణ విజయానికి అందరం కలిసిపనిచేద్దామన్నారు. ఈ సందర్భంగా పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి, ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ విజయమే లక్ష్యంగా పనిచేయాలని తీర్మానించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డితో ఈనెల 7న జరిగే ఆత్మీయ సమావేశానికి అందరూ తరలిరావాలని విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు.

మరో చిన్నారి మృతి



చికిత్సపొందుతూ మృతిచెందిన చిన్నారి

చింతూరు: మండలంలో చిన్నారుల మరణాలు ఆగడంలేదు. వారం వ్యవధిలో వివిధ కారణాలతో నలుగురు చిన్నారులు మృత్యువాత పడగా తాజాగా సోమవారం రాత్రి నాలుగు నెలల చిన్నారి అనారోగ్యంతో మృతిచెందింది. చింతూరు మండలం వంకగూడెంకు చెందిన మహేష్, రమ్య దంపతుల నాలుగు నెలల కుమార్తెకు మూడు రోజులుగా అనారోగ్యంగా ఉండడంతో సోమవారం మధ్యాహ్నం చికిత్స నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నపిల్లల వైద్యనిపుణుడు పాపను పరిశీలించి పరీక్షలు చేయించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో సాయంత్రం పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి పంపించామని, అక్కడ వైద్యం అందిస్తుండగా పాప మృతిచెందినట్టు చింతూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చేముందు పాపకు నాటుమందు వేయడంతో పాటు తానుకూడా నాటుమందు తాగినట్టు తల్లి చెప్పిందని ఆయన తెలిపారు. మూడు రోజులుగా పాపకు లోజ్వరం, దగ్గు, జలుబు ఉండగా నాటుమందు వేశారని, తగ్గక పోవడంతో ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారని డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు.

స్టాక్‌పాయింట్ నుంచి అక్రమంగా ఇసుక తరలింపు

- ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

ఎటపాక: మండలంలోని గుండాల ఇసుక స్టాక్ పాయింట్ నుంచి పది రోజులుగా రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో గుండాల వద్ద గల ఇసుక స్టాక్ పాయింట్లలో ఎటువంటి కాపలా లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత గుండాల ర్యాంపు వద్ద రెండు స్టాక్ పాయింట్లలో ఇసుక అమ్మకాలను మైనింగ్,రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కొద్ది రోజుల పాటు జరిపారు. తరువాత విక్రయం నిలిపివేశారు. భద్రాచలంపట్టణంలో ఇసుక డిమాండ్ ఉండడంతో అర్ధరాత్రివేళ ఇక్కడి నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈస్టాక్ పాయింట్ల నుంచి వంద ట్రాక్టర్ల ఇసుకను తరలించారని చెబుతున్నారు. సమాచారం అందడంతో డీటీ పృథ్వీ, ఎస్ఐ పార్థసారథి నిఘాపెట్టారు. ఆదివారం అర్ధరాత్రి స్టాక్‌పాయింట్ వద్ద ఇసుక లోడ్‌చేసి తెలంగాణకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాక్టర్ ఎటపాక మండలం చోడవరానికి చెందిందని వారు చెప్పారు.

క్లుప్తంగా

మొరాయించిన ఆర్టీసీ బస్సు

జి.మాడుగుల: గమ్య స్థానం చేర్చాల్సిన **ఆర్టీసీ** బస్సులు ఎక్కడబడితే అక్కడే మొ**రాయిస్తూ** ఆగిపోతుండటంతో ప్రయాణికులు **పలు** ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొం**టున్నారు.** ప్రతి రోజూ పాడేరు నుంచి జి.మా**డుగుల,** చింతపల్లి, గూడెంకొత్తవీధి తదితర ప్రాంతా లకు వెళ్లాల్సిన వారు ఆర్టీసీ బస్సులను ఆశ్రయి స్తుంటారు. అయితే ఆర్టీసీ బస్సులు తరచూ మొరాయిస్తుడడంతో గంటల కొద్దీ ఆలస్యంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం గూడెం వెళ్తూ మార్గం మధ్యలో జి.మాడుగుల గ్రామం వచ్చే సరికి నిలిచిపోయింది. దీంతో ప్రయాణి కులు పలు ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డు మార్గంలో కండిషన్ లేని బస్సులు నడిపిస్తుండ డంతో తరచూ మొరాయిస్తు నిలిచిపోతున్నా యని నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని వారు కోరుతున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్


గంజాయి తరలిస్తున్న వ్యక్తులు

సీలేరు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మారెమ్మతల్లి ఆలయం వద్ద పోలీసుల తనిఖీల్లో గంజా యితో పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తుల్ని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి గం జాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై అనుమానంతో తనిఖీ చేశారు. వీరి వద్ద 10 కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయితో పట్టుబడ్డ మండి శివరామ్, బాంగి సునీల్, కుమార్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుం చి రెండు బైక్‌లు, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీ లకు ప్రీతి, సరయు, ఆనన్య ఎంపికయ్యారని కోచ్ రమేష్ తెలిపారు. ఈ పోటీలు కర్నాటకలో ఈనెల 30 నుంచి 1 వరకు జరగనున్నాయి. ప్రీతి కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మూడు గోల్డ్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించిందని ఆమె తండ్రి వెంకటరావు ఓ ప్రక టనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని విశాఖపట్నం స్పోర్ట్స్ అథారిటీ ఆశిస్తుందని పేర్కొన్నారు.

మోగనున్న పెళ్లి బాజాలు





అల్లిపురం : ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహుర్తాలు లేక శుభకార్యాలకు బ్రేక్ పడింది. దీంతో పెళ్లి బాజాలు మోగక కల్యాణ మండపాలు కళ తప్పాయి. శుభకార్యాలపై ఆధార పడ్డ వ్యాపా రాలు వెలవెలబోయాయి. శ్రావణ మాసం ప్రారం భం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పెళ్లి సం దడి మొదలైంది. హిందూ వివాహ వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. వివాహ సమయంలో జ్యోతిష్యం, పంచాంగం ప్రకారం, పెళ్లి వంటి ముఖ్యమైన కార్యాలకు జాతకానికి ప్రాధాన్యతని స్తారు. కొంతకాలంగా పెళ్లికి సంబంధించి ఎలాం టి శుభ ముహుర్తాలు కుదరలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి ఏప్రిల్ నెలల్లో బ్రేక్ పడిన పెళ్లి ముహుర్తాలు రెండు నెలల విరామం తరువాత జూలై, ఆగస్టు, నవంబర్, డిసెంబర్ నెలల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. దీంతో పెళ్లిళ్లు చేసుకు నేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. మరో పక్క నూతన గృహ ప్రవేశాలు, గృహ నిర్మా ణాలకు శంకుస్థాపనలు జోరందుకోనున్నాయి.

మరోసారి శూన్య మాసం

ఈ నెల 7వ తేదీ నుంచి మొదలైన పెళ్లి సందడి సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మరోసారి శూన్యమాసం రానుం ది. భాద్రపదమాసం సైతం శూన్యమాసం కావడంతో శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. ఏడాది చివర డిసెంబర్‌లో మార్గశిరమాసం కావడంతో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బల మైన ముహుర్తాలు లేవని పండితులు చెబుతు న్నారు.

కల్యాణమండపాలకు డిమాండ్

ముహూర్తాలు అధికంగా ఉండటంతో కల్యాణ మండపాలకు డిమాండ్ కూడా పెరిగింది. అదే రీతిలో షామియానాలు, వంటవాళ్లకు, క్యాటరింగ్ పరిశ్రమ కూడా ఊపందుకుంది. బలమైన ముహూర్తాలు ఉండే రోజుల్లో డిమాండ్ బాగా ఉం డటంతో ఇప్పటికే కల్యాణమండపాలు బుకింగ్‌లు పూర్తి చేసుకున్నట్లు మండపాల నిర్వాహకులు చెబుతున్నారు. అదే విధంగా వీడియోగ్రాఫర్లు, ఫొటో గ్రాఫర్లు, పురోహితులను ఇప్పటికే మాట్లా డుకుని సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. రానున్న శ్రావణ మాసంలో ఉన్న కొద్దిపాటి ముహుర్తాలు కావడంతో ముఖ్యంగా 8,18,22 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి. దీంతో సిటీతో పాటు జిల్లాలో వేలకు పైగా జంటలు ఒక్కటవుతాయని అంచనా. పెళ్లి శుభకార్యాల్లో కలుసుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రైలు, బస్సు సర్వీసులకు రిజర్వేషన్లు చేసుకునే ప్రయ త్నంలో పడ్డారు.

పెళ్లి ముహుర్తాలు

ఆగస్టు: 7,8,9,10,11,13,14,15,17,18,19,22,23,24,26,28
సెప్టెంబర్ : ముహుర్తాలు లేవు
అక్టోబర్ : 5,6,7,9,10,11,12,13,14,16,17,20,21,23,26,27
నవంబర్ : 3,7,8,9,10,12,13,14,16,17,20,21,23,26,27
డిసెంబర్ : ,5,6,7,8,9,10,11,14,15,16,18,20,22,23,25,26
జనవరి : 2025: 16,17,18,19,20,21,23,24,25,26,27
ఫిబ్రవరి : 2,3,6,7,12,13,14,15,16,18,19,21,23,25
మార్చి : 1,2,6,7,12
ఏప్రిల్ : 14,16,17,18,19,20,21,25,29,30

కళకళలాడుతున్న వస్త్ర, బంగారు దుకాణాలు

శుభకార్యాలతో వ్యాపారాలు జోరందుకు న్నాయి. **వస్త్రాలు,** బంగారు ఆభరణాలు **కొనుగోళ్లతో** దుకాణాలు సందడిగా **మారాయి. మరో** పక్క బంగారు ధరలు ఆకా శన్నంటుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో కల్యాణం అనేది ఒకసారే వస్తుందని ఖర్చుకు వెనుకాడకుండా స్తోమతకు తగిన విధంగా కొనుగోలు చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు మెండు

కొంతకాలంగా పనులు లేక ఢీలాపడిన శుభకార్యాలకు అనుబంధ వ్యాపారాలు అయిన పురోహితులు, క్యాటరింగ్, షామి యానాలు, కల్యాణమండపాల వారితో పాటు లైటింగ్, పూల డెకరేషన్, ఫొటో స్టూడి యోల వారికి, ఐస్‌క్రీం, మినరల్ వాటర్, హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులు, ఈ ముహూర్తాలలో చేతి నిండా పని దొరకటంతో ఆయా రంగాల్లో రాణిస్తున్న వారికి ఇది శుభసమయమని చెప్పవచ్చు.

ఇక నాలుగు నెలలు మాత్రమే శుభముహుర్తాలు



ఈ ఏడాది ఏప్రిల్ తరువాత ఆగష్టు, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మాత్రమే శుభముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్ మాసంలో శూన్యమాసం రావడంతో ముహూర్తాలు లేవు. పుష్య మాసం తరువాత 2025లో ఏప్రిల్ 30వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయి.

–బులుసు సాయికృష్ణ శర్మ, వేద పండితులు, అల్లిపురం

ఇప్పటికే బుకింగ్‌లు ఒప్పుకున్నాం



ఇప్పటికే పెళ్లిళ్లకు బుకింగ్‌లు మొదలయ్యాయి. ఒక రోజు మూడు నుంచి నాలుగు పెళ్లిళ్లు ఉన్నాయి. ముఖ్యంగా ఫిబ్రవరి 14, 21, 29 తేదీల్లో ఎక్కువగా పెళ్లిళ్లు ఉన్నాయి. ఆ సమయంలో వర్కర్లు దొరకడం కూడా కష్టంగా ఉంది. అయినా వచ్చిన అవకాశాన్ని వదులుకోలేం. డిమాండ్ ఉన్న రోజుల్లో డబుల్ పేమెంట్ కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నాం.

–మళ్ల వెంకటరావు, ఈవెంట్ నిర్వాహకుడు

సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో కళాజాత

- ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: సీజనల్ వ్యాధులు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు చింతూరు డివిజన్లో కళా జాత కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సోమవారం తెలి పారు. వర్షాలు, వరదల కారణంగా ఈ ప్రాంతం లో కీటకజనిత వ్యాధులు, కలుషితనీరు, ఆహారం ద్వారా సంభవించే టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధుల, మూఢనమ్మకాల వల్ల కలిగే అనర్థాలపై కళాజాత ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు తెలి పారు. చింతూరు డివిజన్‌లో 25 గ్రామాల్లో రోజుకు నాలుగు గ్రామాల్లో మంగళవారం నుంచి ఈనెల 12 వరకు కళాజాత కార్యక్రమాలు జరుగుతాయని పీవో తెలిపారు. ఆయా మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కళాజాత కార్య క్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిం చాలని పీవో ఆదేశించారు.

ఆదివాసీ దినోత్సవంపై సమావేశం : ప్రపంచ ఆది వాసీ దినోత్సవాన్ని ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 9న ఘనంగా నిర్వహించనున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పీవో మాట్లాడుతూ వివిధ రంగాల్లో రాణిం చిన ఆదివాసీ కళాకారులకు సన్మానంతో పాటు పాఠ శాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీపీ సవలం అమల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఏపీవో కంచర్ల సుజాత, ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైటీసీలో ప్రత్యేక శిక్షణ

చింతూరు: బీఈడీ, డీఈడీ, టెట్ పాసైన గిరిజన యువతకు ఎటపాక యూత్ ట్రైనింగ్ సెంటర్(వై టీసీ)లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సదు పాయం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల పరిశీలించిన అనంతరం ఈనెల 14న చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో ఫైనల్ లిస్టు ప్రకటిస్తామని పీవో తెలిపారు. ఆగస్టు మూడోవారం నుంచి 75 రోజుల పాటు 50 మంది గిరిజన అభ్యర్థు లకు భోజనం, వసతి సౌకర్యంతో ఎటపాక వైటీసీలో ఉచిత శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు.

విశాఖలో అదృశ్యమై డుంబ్రిగుడలో శవమై..

- అనుమానాస్పదంగా కంచరపాలెం యువకుడి మృతి
- పాలంగెడ్డలో విగతజీవిగా చంద్రకాంత్
- తాళ్లతో కట్టి, కొట్టి చంపినట్లు అనుమానాలు
- స్నేహితులే హత్య చేశారని తండ్రి ఆరోపణ
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ: విశాఖలో అదృశ్యమైన యువకుడు డుంబ్రిగుడలోని కొర్రాయి పంచాయతీ జాంగుడ పాలంగెడ్డలో విగతజీవిగా కనిపించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడి అదృశ్యంపై విచారణ చేపట్టిన పోలీసులకు బాగా పాడైన స్థితిలో మృత దేహం కనిపించింది. చిత్రహింసలకు గురిచేసి, కాళ్లూ చేతులూ కట్టి, గెడ్డలో పడేసినట్లు గుర్తించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా నిర్ధారించి, దర్యాప్తు ప్రారంభించారు. అరకులోయ సీఐ రుద్రశేఖర్ సోమవారం స్థానిక విలేకరులకు తెలిపిన వివరాలు. విశాఖలోని కంచరపాలెం జైభారత్‌నగర్‌కి చెందిన బంగారి కోటేశ్వరావు, ఈశ్వరమ్మ దంపతులు తమ కొడుకు చంద్రకాం త్(17) అదృశ్యంపై డుంబ్రిగుడ పోలీసులకు గత నెల 30న ఫిర్యాదు చేశారు. అంతకు ఒక రోజు ముందు నుంచే తమ కుమారుడి జాడలేకపోవడం తో, అరకు పరిసరాల్లోనే ఉన్నాడని, కనిపెట్టాల్సిం దిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం పోలీసు లకు పాలం గెడ్డలో యువకుడి మృతదేహం ఉన్నట్లు పొలం పనులు చేస్తున్న కూలీల నుంచి సమాచారం అందింది. దీంతో సీఐ రుద్రశేఖర్ క్లూస్ టీమ్‌తో వెళ్లి, డుంబ్రిగుడ పోలీసుల సాయం తో మృతదేహాన్ని గెడ్డలో నుంచి బయటికి తీశారు. యువకుడిని దారుణంగా కొట్టి చంపినట్టుగా గుర్తు లున్నాయి. చనిపోయి ఐదారు రోజులై ఉండ వచ్చని పోలీసుల అంచనా. మృతదేహం పూర్తిగా పాడైపోయింది. తల్లిదండ్రులు ఆ మృతదేహం తమ కొడుకు చంద్రకాంత్‌దిగా గుర్తించి, బోరున విలపించారు. తమ కుమారుడిని స్నేహితులే చం పి ఉంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృ తదేహాన్ని పోస్టుమార్టం కోసం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. యువకుడి మృ తికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రుద్రశేఖర్, డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కు మార్ తెలిపారు.

అరకు ఎంపీ ఔదార్యం


ఎంపీ తనూజారాణి సూచనలతో సమకూర్చిన అంబులెన్స్‌లో బాలుడి మృతదేహాన్ని తీములబం ధ గ్రామానికి తరలిస్తున్న స్థానికులు

అరకులోయటౌన్: అనారోగ్యంతో బాధప డుతున్న తమ కుమారుడిని విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొంది, పరిస్థితి విషమించడంతో స్వగ్రా మానికి అరకులోయ మీదుగా బస్సులో తీసుకు వస్తు ఉండగా అరకులోయ సమీపంలో చనిపో యాడు. తమ కుమారుడి మృత దేహంతో అరకు లోయలో బస్సు దిగిన వారికి ఊరి కాని ఊరిలో ఏం చేయాలో ఎవరికి సాయం అడగాలో తెలియని పరిస్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి భర్త వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ సాయ మందించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గూడెం కొత్తవీధి మండలం తీముల బం ధ గ్రామానికి చెందిన కొర్రా సుబ్బారావు కుమా రుడు కార్తిక్ (13) ఆనారోగ్యంతో బాధపడుతుం డగా చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు తర లించి మెరుగైన వైద్యం అందించాలని సూచిం చారు. దీంతో ఈనెల 3వ తేదిన విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు జరిపారు. బాలుడు కుక్కకాటుకు గురై వైద్యం చేయించుకోక పోవడంతో పరిస్థితి విషమించినట్టు వైద్యులు సూచించారు. దీంతో తన కుమారుడుని స్వగ్రా మానికి తీసుకెళ్లేందుకు విశాఖ నుంచి అరకు మీదుగా గూడెం కొత్తవీధి వెళ్లేందుకు ఆదివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. అరకులోయ చేరుకోక ముందే బాలుడు చనిపోయాడు. దీంతో బాలుడి తల్లి, దండ్రులు అరకులోయ ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ రహదారిలో బాలుడి శవంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని వైయ స్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా ప్రతినిధి మొష్యా రంజిత్ కుమార్ డిల్లీలో ఉన్న ఎంపీ తనూజరాణికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. విషయం తెలుసు కున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి తక్షణమే భర్త చెట్టి వినయ్ అరకులోయ ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్‌తో మాట్లాడి శవాన్ని తీసుకువెళ్లెందుకు అంబులెన్స్ సమకూర్చారు. అం తే కాకుండా కొంత ఆర్థిక సహాయం చేశారు. స్థాని కంగా ఉన్న వారు కూడా బాలుడి తల్లిదండ్రుల ఆక్రందన చూసి ఎవరికి తోచినంత ఆర్థిక సహాయం చేశారు. దీంతో బాలుడి మృతదేహాన్ని అరకులోయ నుంచి వారి స్వగ్రామానికి తీముల బంధ తీసుకువెళ్లారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ శోభ

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణా ధికారి పి. శ్రీనివాసులరెడ్డి పూజలు ప్రారంభించారు. తొలుత గణపతి పూజ నిర్వహించారు. వేదమంత్రాల మధ్య నాదస్వర సుస్వరాలు నడుమ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. పూజలో 25 మంది ఉభయదాతలు రెండు బ్యాచ్‌ల్లో పాల్గొన్నారు. శ్రావణ మాసం నెలరోజులు (వచ్చే నెల 3వరకు) జరిగే పూజలకు అవసరమయ్యే సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని, ప్రత్యేక పూజల్లో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో శ్రీనివాసు లరెడ్డి తెలిపారు. పూజ అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రం, కం డువా, జాకెట్టు, రాగి స్టాండు యంత్రం, ప్రసాదం అందజేయనున్నట్టు ఈవో తెలిపారు. శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు గురు/శుక్రవారాలు మినహా ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తామన్నారు. పరోక్షంగా పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమ చేసి, పేరు, గోత్రం, చిరునామా వివరాలు 8985515989 వాట్సప్‌లో పం పాలన్నారు. ఆన్‌లైన్ సేవలు/పూజా టికెట్లు aptemples.ap. gov.inలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు వెంపలి రాంబాబు, కె.తిరుమల్లేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సికెల్‌సెల్ ఎనీమియాపై అవగాహన


రంగశీలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు మోహన్, శాంతి

హుకుంపేట: సికిల్ సెల్ ఎనిమియ వ్యాధిపై అవగా హన కలిగి ఉండాలని స్థానిక వైద్యాధికారులు డాక్టర్లు మోహన్, శాంతి చెప్పారు. సోమవారం మండలంలోని రంగశీల, సూకురు గ్రామల్లో ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు కళాజాత కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికెల్‌సెల్ ఎనీమియ వ్యాధి కలిగిన వారు మంచి పౌష్టిక ఆహారం తీసుకుని ఐరన్ మాత్రలు వినియోగించాలని సూచించారు. 18 సం వత్సరాల నుంచి 40 సంవత్సరాలు వారు రక్త పరీ క్షలు చేసుకోవాలని తెలిపారు. కళాకారులు శ్రీనివా సరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

- సెలవుపై వెళ్లిన సూపరింటెండెంట్ ప్రత్యక్షం
- తన సీటులో కూర్చోవాలని ప్రయత్నించిన డాక్టర్ అశోక్‌కుమార్
- ఉత్తర్వులు లేకుండా చార్జ్ అప్పగించనని స్పష్టం చేసిన శివానంద


ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శివానంద్


డాక్టర్ అశోక్ కుమార్

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రిలో హైడ్రామా నడిచింది. రెండు నెలల క్రితం సెలవుపై వెళ్లిన సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ సోమవారం ప్రత్యక్షమయ్యారు. తన సీటులో కూర్చోవాలని ప్రయత్నించారు. అయితే ఉన్నతాధికారుల నుం చి ఉత్తర్వులు లేకుండా ఆయన తిరిగి విధుల్లో చేరడంపై కేజీ హెచ్ అధికారులు తర్జనభర్జన పడ్డారు. ఉత్తర్వులు లేకుండా చార్జ్ అప్పజెప్పడంపై ప్రస్తుత ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద కూడా విముఖత చూపించారు. దీనిపై సుమారు రెండు గంటల పాటు కేజీహెచ్‌లో అధికారుల్లో విస్తృ త చర్చ జరిగింది. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన పి.అశోక్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీలను వివిధ కారణాలతో రాష్ట్ర డైరెక్టర్ వైద్య విద్యాశాఖకు సరెండర్ చేశారు. దీంతో కేజీహెచ్‌లో వివాదాలు భగ్గుమన్నాయి. ఇదిలా ఉంటే రెండు నెలల క్రితం డాక్టర్ అశోక్‌కుమార్‌పై నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌పై కేసు నమోదైం ది. ఈక్రమంలో అశోక్ కుమార్ ఈ ఏడాది మే 29న దీర్ఘకాల సెలవుపై వెళ్లిపోయారు. దీంతో డాక్టర్ పి.శివానంద్‌ను ఇంచార్జ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. అప్పటి నుంచి ఆయనే కొనసాగుతున్నారు. వాస్తవానికి డ్రాయింగ్ ఆఫీసర్ హోదాలో 14 రోజులు సెలవు పెడితే కచ్చితంగా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా రెండు నెల లకు పైగా సెలవులో ఉన్న డాక్టర్ అశోక్ కుమార్ సోమవారం సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరడానికి రావడంతో అంతా విస్తుపోయారు. ఉత్తర్వులు తెచ్చుకుంటే చార్జ్ అప్పగిస్తామని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శివానంద స్పష్టం చేయడంతో చేసే దేమీ లేక అశోక్ కుమార్ వెళ్లిపోయారు.

పాఠశాలకు బెంచీల వితరణ


కొత్తాబు పాఠశాలలో విద్యార్థులకు బెంచీలను అందజేస్తున్న ఎంపీడీవో సాయినవీన్

పాడేరు : మండలంలోని గబ్బంగి పంచాయతీ కొత్తాబు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పాడేరు ఎంపీడీవో సాయినవీన్, తన సిబ్బందితో కలిసి బెంచీలను సమకూర్చారు. 2018లో అప్పటి గ్రూప్–1 డీపీవో అధికారి, 2023 సంవత్సరంలో పలువురు ఎంపీడీ వోలు శిక్షణలో భాగంగా కొత్తాబు గ్రామాన్ని సం దర్శించారు. అక్కడి పాఠశాలను తనిఖీ చేసి విద్యా ర్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు కూర్చునేందుకు బెంచీలను సమకూర్చాలని విద్యా ర్థులు కోరారు. వారి కోరిక మేరకు సోమవారం కొత్తాబు పాఠశాలకు వెళ్లి గ్రామస్తుల సమక్షంలో బెంచీలను అందజేశామని ఎంపీడీవో సాయినవీన్ స్పష్టం చేశారు. బెంచీలు ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, గ్రామస్తులు ఎంపీడీవో సాయినవీన్‌తో పాటు కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలి పారు. ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యువాత

- ఒకే రోజులో ఆరు గొర్రెలు మృతి
- అందని వైద్య సేవలు
- ఆందోళనలో రైతులు


కుమ్మరివీధి గ్రామంలో మృతి చెందిన జీవాలు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ కుమ్మరివీధిలో గల్లేలు సంజీవరావు అనే రైతుకు చెందిన జీవాలు మృతి చెందాయి. సోమవారం మధ్యాహ్నం ఆరు గొర్రెలు మృతి చెందాయని. వారం రోజుల వ్యవధిలో ఒకే రైతుకు చెందిన 17 జీవాలు మృతి చెందినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ముక్కు నుంచి నీరు కారుతూ కడుపు ఉబ్బి రెండు రోజుల వ్యవధిలోనే మృతి చెందినట్టు ఆయన చెప్పారు. గ్రామంలో సుమారు 60 గొర్రెలు పది రోజుల వ్యవధిలో మృతి చెందాయని, పశు సంవ ర్థక శాఖ అధికారులకు సమాచారం అందించిన స్పందించడం లేదన్నారు. ఎంతో కష్టపడి పెంచు కుంటున్న జీవాలు మృతితో ఆర్థికంగా నష్టపో యామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందిం చాలని కోరారు. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు తక్షణమే ఆదుకోవాలని కోరారు.